ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 17 శనివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 10 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SATURDAY OCTOBER 17 2026 | VOL:1 | ISSUE: 10 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

2

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.. 1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్

- తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని కేటీఆర్ ఆరోపణ
- 1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలు వృథాగా దిగువకు వెళ్లాయని వ్యాఖ్య
- ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు ప్రణాళికలు లేవని మండిపాటు
- పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను ఏపీ తరలించిందని వ్యాఖ్య

తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చేతకాని కరవు' (మిగతా 2వ పేజీలో..)



తెలంగాణకు మరో దిగ్గజ కంపెనీ.. సీఎం రేవంత్‌తో హ్యుందాయ్ ప్రతినిధుల భేటీ

- సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధులు
- జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన
- ఈ కేంద్రం ద్వారా 4,275 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- తెలంగాణలో కార్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని హ్యుందాయ్‌కు ఆహ్వానం



తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.శుక్రవారం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా తమ పెట్టుబడి ప్రణాళికలను సీఎంకు వారు వివరించారు. జహీరాబాద్‌లో నెలకొల్పబోయే ఆర్ అండ్ డీ కేంద్రం స్వరూపం, దాని ద్వారా లభించే ఉపాధి కల్పన వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు.హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండంటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య

(మిగతా 2వ పేజీలో..)





హైదరాబాద్ సహా ఏలు జిల్లాలకు వర్ష సూచన..ఐఎండీ ప్రకటన

- ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలో వర్ష సూచన
- హైదరాబాద్, వరంగల్ సహా 9 జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం
- ఆంధ్రప్రదేశ్‌లోనూ పలుచోట్ల జల్లులు పడతాయని అంచనా
- వారంగా కొనసాగుతున్న ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం

గత వారం రోజులుగా (మిగతా 2వ పేజీలో..)

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

- వీలైనంత త్వరగా ఒప్పందాన్ని ముగిస్తామన్న కేంద్రమంత్రి నిర్మల
- ఒప్పందం మొదటి దశ పూర్తయిందని, లీగల్ డ్రాఫ్ట్ సిద్ధమవుతోందని వెల్లడి
- బ్యాంకాక్‌లో జరిగిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ సమావేశాల్లో వ్యాఖ్యలు



భారత్-అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తనకు వివరించారని నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంతో పాటు, ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుపై కూడా మంత్రి ప్రసంగించారు. అంతర్జాతీయంగా అనేక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తదుపరి కాలంలో, గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక (మిగతా 2వ పేజీలో..)



ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

- ఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందన్న కవిత
- రేవంత్ పాలన పక్కన పెట్టేశారని విమర్శ
- రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉంటామని వెల్లడి

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో (మిగతా 2వ పేజీలో..)



ఎల్ నినోపై సీఎం రేవంత్ పిలుపు.. స్పందించిన నాగార్జున

- ఎల్ నినోపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ పిలుపున
- సహాయం చేయడానికి సినీ పరిశ్రమ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్న నాగార్జున
- తెలంగాణలో తీవ్ర నీటి, విద్యుత్ సంక్షోభం తప్పదని హెచ్చరించిన ప్రభుత్వం

తెలంగాణలో ఎల్ నినో ప్రభావంతో తలెత్తనున్న సంక్షోభంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చిత్ర పరిశ్రమ సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపునకు ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున సంపూర్ణ మద్దతు (మిగతా 2వ పేజీలో..)

ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు.. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం కసరత్తు!

- ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం దృష్టి
- ఏప్రిల్ 17న లోక్‌సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

(మిగతా 2వ పేజీలో..)





అమెరికా మంత్రి పర్యటన: జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై రాహుల్ గాంధీ విమర్శలు
- విదేశాంగ మంత్రి జైశంకర్‌ను 'రూబియో సిబ్బంది' అంటూ పరోక్షంగా వ్యాఖ్యలు
- విదేశాంగ శాఖ అధికారులు గందరగోళంలో ఉన్నారంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనకు ముందే రాజకీయ వివాదం నెలకొంది. ఈ పర్యటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. విదేశాంగ మంత్రిని ఉద్దేశించి ఆయన పరోక్షంగా 'రూబియో సిబ్బంది' అని సంబోధించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసలేం జరిగింది?

వచ్చే వారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో (మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

(మొదటి పేజీ తరువాయి)

అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఎల్ నినోపై సీఎం రేవంత్ పిలుపు.. స్పందించిన నాగార్జున

(మొదటి పేజీ తరువాయి

ప్రకటించారు. విపత్కర పరిస్థితుల్లో సహాయం అందించేందుకు సినీ రంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఇటీవల 'ఇట్లు అర్జున' చిత్రానికి సంబంధించిన ఓ కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం కేవలం తెలంగాణకే పరిమితం కాదని, ఇది ప్రపంచవ్యాప్త సమస్య అని పేర్కొన్నారు. ఇటువంటి క్లిష్ట సమయాల్లో ప్రజల్లో చైతన్యం తీసుకురావడం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సామాజిక సమస్యలు ఎదురైనప్పుడు సినీ పరిశ్రమ ఎల్లప్పుడూ ముందుండి తన వంతు సహకారాన్ని అందిస్తుందని ఆయన గుర్తుచేశారు. ఎల్ నినో ప్రభావం ఎంతకాలం కొనసాగుతుందో అంచనా వేయలేమని, అందుకే ప్రజలందరూ నీటిని పొదుపుగా వినియోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో తీవ్ర నీటి, విద్యుత్ సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించిన సంగతి విదితమే. వర్షపాతం గణనీయంగా తగ్గడం వల్ల కృష్ణా, గోదావరి బేసిన్లలోని జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని ప్రభుత్వం వెల్లడించింది. సాధారణంగా అవసరమయ్యే 460 టీఎంసీలకు గాను, ప్రస్తుతం కేవలం 200-209 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో, రాబోయే యాసంగి సీజన్‌లో నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి సాగును తగ్గించుకోవాలని లేదా వాయిదా వేసుకోవాలని రైతులకు ముఖ్యమంత్రి సూచించారు. తాగునీటి సరఫరాకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ, విద్యుత్‌ను కూడా అత్యంత పొదుపుగా వినియోగించాలని ఆయన ప్రజలను కోరారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

(మొదటి పేజీ తరువాయి

వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచిందని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ వంటి చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆమె వివరించారు. ప్రజాధనం వినియోగం పట్ల ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

ఢిల్లీలో ధర్నాలతో భారీ వ్యాపార నష్టం.. పరిహారం కోరుతూ కోర్టులో రెస్టారెంట్ వ్యాపారి పిటిషన్

కన్నాట్ ప్లేస్‌లో నిరసనలపై ఢిల్లీ హైకోర్టులో వ్యాపారి పిటిషన్

ఆందోళనల వల్ల కలిగిన నష్టాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్

అక్టోబర్ 10న జరిగిన ధర్నాతో రూ.200 కోట్ల నష్టం వాటిల్లిందని ఆరోపణ

నిరసనలు, వ్యాపార హక్కుల మధ్య సమతుల్యం ఉండాలని వాదన

ఈ వ్యాజ్యంపై అక్టోబర్ 27న విచారణ జరపనున్న ఉన్నత న్యాయస్థానం

దేశ రాజధాని ఢిల్లీలోని ప్రముఖ వాణిజ్య కేంద్రం కన్నాట్ ప్లేస్‌లో అనధికారిక నిరసనలు, ఆందోళనల కారణంగా వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని, వాటిని నియంత్రించవలసిందిగా కోరుతూ ఒక రెస్టారెంట్ యజమాని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నిరసనల వల్ల సంభవించిన ఆర్థిక నష్టాలకు బాధ్యులైన వారి నుంచి పరిహారం ఇప్పించాలని ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు.కన్నాట్ ప్లేస్‌లోని ఒక రెస్టారెంట్ భాగస్వామి ఆయుష్ చోప్రా, తన న్యాయవాది ఉమంగ్ త్యాగి ద్వారా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. శుక్రవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ఇదే తరహా వ్యాజ్యంపై గురువారం ఒక ఉత్తర్వు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసిన ధర్మాసనం, ఈ పిటిషన్‌పై అక్టోబర్ 27న విచారణ జరుపుతామని పేర్కొంది.కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో సమావేశం కావాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ పిటిషన్ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, సెంట్రల్ పార్క్ నిరసనలకు నిర్దేశించిన ప్రాంతం కాదని, పండుగ సీజన్‌లో ఇక్కడ ఆందోళనలు నిర్వహిస్తే వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా దెబ్బతింటాయని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు.అక్టోబర్ 10న సీజేపీ నిర్వహించిన ఆందోళనకు పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ వారు నిరసన చేపట్టారని, తత్ఫలితంగా కన్నాట్ ప్లేస్‌లోని దుకాణాలను మూసివేయాల్సి వచ్చిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ ఒక్కరోజే కన్నాట్ ప్లేస్‌లో రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల వరకు, ఢిల్లీ వ్యాప్తంగా సుమారు రూ. 2,000 కోట్ల మేర వ్యాపారం నష్టపోయిందని వ్యాపార సంఘాల అంచనాలను పిటిషనర్ ఉటంకించారు. ఈ ఆందోళనల వల్ల నవరాత్రుల సమయంలోనూ తన రెస్టారెంట్ వ్యాపారం గణనీయంగా పడిపోయిందని ఆయుష్ చోప్రా తెలిపారు.నిరసన తెలిపే హక్కుకు, వ్యాపారం చేసుకునే ప్రాథమిక హక్కుకు మధ్య సమతుల్యత ఉండాలని పిటిషనర్ వాదించారు. సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన తీర్పులను ప్రస్తావిస్తూ, నిరసనలు ఎక్కడపడితే అక్కడ కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతాల్లోనే జరగాలని కోరారు. అలాగే అక్టోబర్ 10 నాటి ఆందోళనకు బాధ్యులైన వారి నుంచి వ్యాపారులకు నష్టపరిహారం ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీస్ కమిషనర్, న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ), ఢిల్లీ ప్రభుత్వాలను ప్రతివాదులుగా చేర్చారు. కాగా, ఇదే అంశంపై గురువారం జరిగిన విచారణ సందర్భంగా, సీజేపీ కార్యకలాపాలను చట్టపరంగా నియంత్రిస్తామని ఢిల్లీ పోలీసులు హైకోర్టుకు హామీ ఇచ్చారు.



ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.. 1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

అని విమర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వాయర్లను నింపకుండా నీటిని వృథాగా దిగువకు వదిలేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

1,000 టీఎంసీల నీరు వృథా చేశారంటూ..

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు చర్యలు లేవు

ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని మార్చి నుంచే వాతావరణ నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యతపై ముందుగానే అంచనాలు వేసి, సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు.మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించుకెళ్లిందని కేటీఆర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సొరంగం ద్వారా కృష్ణా జలాలను వినియోగించుకుందని, కుప్పం ప్రాంతానికి కూడా నీటిని అందించిందని అన్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవసరాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాలని కేటీఆర్ వ్యాఖ్యల సారాంశం. అయితే, నీటి విడుదలకు సంబంధించిన గణాంకాలు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై చేసిన ఆరోపణలు కేటీఆర్ వెల్లడించినవే.

హైదరాబాద్ సహా ఏలు జిల్లాలకు వర్ష సూచన..ఐఎండీ ప్రకటన

(మొదటి పేజీ తరువాయి

తీవ్రమైన ఎండలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో తెలంగాణలోనూ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా పలు జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నేటి నుంచే వర్షాలు ప్రారంభమవుతాయని వాతావరణ శాఖ తెలపడంతో.. తీవ్రమైన ఉక్కపోత, వడగాడ్పులతో సతమతమవుతున్న ప్రజలకు ఇది పెద్ద ఊరట. రుతుపవనాల రాకతో ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడనుంది.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు.హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు."ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

అమెరికా మంత్రి పర్యటన: జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

(మొదటి పేజీ తరువాయి

రూబియో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ యూనిట్‌ను సందర్శించనున్నారు. అనంతరం ముంబైలో పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. ఈ భేటీలలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పాల్గొంటారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు.ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రూబియో తన సిబ్బందిని ముంబైకి రమ్మని ఆదేశించారు. మోదీ గారూ... విదేశాంగ మంత్రిత్వ శాఖలో మీ అధికారులు ఏం జరుగుతుందో తెలియక గందరగోళంలో ఉన్నారు. వారికి మీరైనా వివరించండి...! లేదా నన్ను చెప్పమంటారా...!" అని తన పోస్టులో పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ తన పోస్టులో ఎక్కడా జైశంకర్ పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, "రూబియో తన సిబ్బందిని రమ్మన్నారు" అని అనడం ద్వారా పరోక్షంగా విదేశాంగ మంత్రిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక దేశ విదేశాంగ మంత్రిని, మరో దేశ విదేశాంగ మంత్రికి చెందిన 'సిబ్బంది' (ఝిటట) గా అభివర్ణించడం అనుచితమని, ఇది దౌత్యపరమైన హోదాను కించపరచడమేనని విమర్శలు వస్తున్నాయి. విదేశాంగ శాఖ అధికారులు గందరగోళంలో ఉన్నారని పేర్కొనడం ద్వారా ప్రభుత్వ సమన్వయ లోపాన్ని ఎత్తిచూపే ప్రయత్నం చేశారని వారు అభిప్రాయపడుతున్నారు.ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యం, ప్రాంతీయ అభివృద్ధిలో పరస్పర సహకారం వంటి కీలక అంశాలపై చర్చించేందుకు రూబియో, జైశంకర్ మధ్య సమావేశం జరిగే అవకాశం ఉంది. ఇంతటి కీలకమైన పర్యటనకు ముందు రాహుల్ చేసిన వ్యాఖ్యలు అనవసర వివాదానికి దారితీశాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతల నుంచి కూడా తీవ్ర ప్రతిస్పందన వచ్చే అవకాశం కనిపిస్తోంది.

వివాదాస్పదమైన వ్యాఖ్యలు

ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు.. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం కసరత్తు!

మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసేందుకు అవసరమైన మద్దతు తమకు ఉందని కేంద్రం ధీమాగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి.ప్రతిపాదిత బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రతిపక్ష పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. దీంతో ఈసారి బిల్లులను ఆమోదింపజేసుకోవడం కేంద్రానికి కీలకంగా మారింది.

రెండు వంతుల మెజారిటీ అవసరం

రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభలో ప్రస్తుతం 540 మంది సభ్యులుండగా, మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మద్దతు కీలకం. ఈ లెక్కన సుమారు 360 మంది సభ్యుల మద్దతు అవసరం. ఎన్డీయేకు లోక్‌సభలో మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన సంఖ్యాబలం విషయంలో సవాళ్లు ఉన్నట్లు సమాచారం.ప్రభుత్వానికి మద్దతు పెరిగిందని, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షం వైపు మారారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలంపై తుది స్పష్టత ఓటింగ్ సమయంలోనే రానుంది.

డీఎంకేతో చర్చలు

బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు డీఎంకేతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తమిళనాడు ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో ఆ పార్టీ విభేదాలు రావడం, ఇండియా కూటమి నుంచి బయటకు రావడం నేపథ్యంలో ఈ సంప్రదింపులకు ప్రాధాన్యం ఏర్పడింది. మరికొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతోనూ కేంద్రం మాట్లాడుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.ఆగస్టు 13న ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ఇంకా అధికారికంగా ప్రొరోగేషన్ ప్రకటించలేదు. దీంతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు అవకాశం ఉందని సమాచారం. అక్టోబర్ 26, 27 తేదీల్లో సంవిధాన్ సదన్‌లో జరగనున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమావేశాల తేదీలను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. సమావేశాలకు వారం రోజుల ముందుగా నోటీసు ఇచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సూర్యాపేట పోలీసుల టెక్నాలజీ పవర్.. బాధితుల చెంతకు 105 ఫోన్లు!

- **20 లక్షలకు పైగా విలువైన మొబైల్ల రికవరీ.. సైబర్ వారియర్స్‌కు ఎస్పీ అభినందనలు**
- **100కు పైగా ఫోన్లను బాధితులకు అందజేయడం 15వ సారి**

సూర్యాపేట, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల):

పోగొట్టుకున్న మొబైల్ తిరిగి దొరకదని ఆశలు వదులుకున్న బాధితులకు సూర్యాపేట జిల్లా పోలీసులు భరోసా కల్పించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, CEIR పోర్టల్ సహకారంతో పోగొట్టుకున్న, చోరీకి గురైన 105 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు తిరిగి అందజేశారు.ఇ ?20 లక్షలకు పైగా విలువైన ఈ ఫోన్లను జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. 100కు పైగా ఫోన్లను ఒకేసారి పంపిణీ చేయడం ఇది 15వ సారి కావడం పోలీసుల పనితీరుకు నిదర్శనంగా నిలిచింది.

ఇతర రాష్ట్రాలకు వెళ్లినా వదల్లేదు!

పోగొట్టుకున్న కొన్ని మొబైల్ ఫోన్లు సుదూర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు చేరుకున్నప్పటికీ సైబర్ వారియర్స్ సాంకేతిక విశ్లేషణతో వాటి ఆచూకీ గుర్తించారు. నిరంతర ప్రయత్నాలతో ఫోన్లను స్వాధీనం చేసుకుని అసలు యజమానులకు అప్పగించారు. విలువైన ఫోన్‌తో పాటు అందులోని వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, జ్ఞాపకాలు కోల్పోయిన బాధితులకు ఈ రికవరీతో ఊరట లభించింది.

అత్యాశే సైబర్ మోసాలకు బాట..

తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయనే ఆశతో గుర్తుతెలియని వ్యక్తులు సూచించే ఆన్‌లైన్ పెట్టుబడి పథకాలను నమ్మి డబ్బులు పెట్టవద్దని ఎస్పీ ప్రజలకు సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, APK ఫైళ్లను అప్రమత్తత లేకుండా డౌన్‌లోడ్ చేసుకోవద్దని, OTP\T, PIN\T, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాణరక్షకాలు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.





డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి విక్రయాలు, వినియోగం లేదా అక్రమ రవాణా గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు. మహిళలు, బాలలపై వేధింపులకు పాల్పడేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మొబైల్ ఫోన్ల రికవరీ, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలు, బాలల రక్షణతో పాటు డ్రగ్స్ నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ కె. నరసింహ తెలిపారు.

ముల్కనూర్ శివారులో గంజాయి కలకలం.. ముగ్గురు పట్టివేత!

- **మంగళ్ దుబ్బలో పోలీసుల దాడులు.. మూడు గంజాయి ప్యాకెట్లు, ఆటో, రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

భీమదేవరపల్లి, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామ శివారులో గంజాయి వినియోగిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళ్ దుబ్బ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్నట్లు అందిన సమాచారంతో ముల్కనూర్ ఎస్ఐ ఎం. రాజు తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి మూడు గంజాయి ప్యాకెట్లు, ఒక ఆటో, రెండు మోటార్‌సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులను చూసి అప్రమత్తం.. విచారణలో వివరాలు

పోలీసుల వివరాల ప్రకారం.. మంగళ్ దుబ్బ ప్రాంతంలోని ఓ వేపచెట్టు కింద ముగ్గురు గంజాయి సేవిస్తుండగా పోలీసులు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, కొంతకాలంగా గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసి ఈ ప్రాంతానికి వచ్చి సేవిస్తున్నట్లు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు.పట్టుబడిన వారిని కొప్పూరు గ్రామానికి చెందిన అంబాల రాజేష్, బాకీ రాజేందర్ అలియాస్ చింటూ, ముల్కనూర్ గ్రామానికి చెందిన అలుగు అంజిగా గుర్తించారు. వారి వద్ద లభించిన గంజాయి ప్యాకెట్లు, వాహనాలు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సమాచారం.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. మత్తు పదార్థాల వినియోగం, అక్రమ విక్రయాలు లేదా రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మత్తు పదార్థాల వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

మార్నింగ్ వాక్‌కు వెళ్లి విగతజీవులైన ఇద్దరు.. బాలెంల వద్ద ఘోర విషాదం!

జనగామ హైవేపై ముగ్గురిని ఢీకొట్టిన డీసీఎం.. ఇద్దరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ నరసింహ.. రహదారులపై వాకింగ్ చేయొద్దని హెచ్చరిక

సూర్యాపేట, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల):

ఆరోగ్యం కోసం తెల్లవారుజామున మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ముగ్గురిని మృత్యువు డీసీఎం రూపంలో కబళించింది. సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జనగామ హైవేపై బాలెంల గ్రామ స్టేజీ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన నాగరాజు, సైదులు, జానయ్య రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు, సైదులు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన జానయ్యను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

ప్రమాద సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహనాన్ని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడా? ప్రమాదానికి మరేదైనా కారణముందా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.ఎస్పీ వెంట డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్, ఎస్ఐ అనిల్ రెడ్డి ఉన్నారు.

ఆరోగ్యం కోసం వెళ్లి.. ప్రమాదానికి బలికావద్దు!

మార్నింగ్ వాక్ ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ రహదారులపై నడవడం అత్యంత ప్రమాదకరమని ఎస్పీ నరసింహ హెచ్చరించారు. నడక కోసం పార్కులు, మైదానాలు, ఇతర సురక్షిత ప్రాంతాలను ఎంచుకోవాలని సూచించారు. రహదారుల పక్కన ఉన్న గ్రామాల ప్రజలు ఉదయం వేళల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.తెల్లవారుజామున పొగమంచు, తక్కువ వెలుతురు కారణంగా రహదారిపై నడిచేవారు, ఎదురుగా వచ్చే వాహనాలు డ్రైవర్లకు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలిపారు. ప్రమాద సూచిక బోర్డులు, బ్లాక్ స్పాట్ల వద్ద వాహనదారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

నిర్లక్ష్యం వద్దు.. ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు!

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్పీ సూచించారు. అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించడం మానుకోవాలని స్పష్టం చేశారు. అలసటగా ఉన్నప్పుడు లేదా నిద్రమత్తులో ఉన్నప్పుడు వాహనాలు నడపకూడదని, పొగమంచు ఉన్నప్పుడు వేగాన్ని తగ్గించి తగినంత దూరం పాటించాలని కోరారు.

ప్రాణం అమూల్యం.. రోడ్డు భద్రత అందరి బాధ్యత

'ARRIVE ALIVE' కార్యక్రమం ద్వారా సూర్యాపేట జిల్లా పోలీసులు రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని ఎస్పీ తెలిపారు. రోడ్డు ప్రమాదం ఒక వ్యక్తి ప్రాణాన్నే కాకుండా అతనిపై ఆధారపడిన కుటుంబం జీవితాన్ని ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. తొందరపాటు కంటే ప్రాణం ముఖ్యమని, తమ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రజలంతా సహకరించాలని ఎస్పీ కె. నరసింహ పిలుపునిచ్చారు.



పాండవుల జీవితం నేటి తరానికి ఆదర్శం

- **ధర్మబద్ధమైన జీవనం, కష్టాలను అధిగమించే తత్వం యువతకు స్ఫూర్తిదాయకం: సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ**

గరిడేపల్లి, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల):



పాండవుల జీవితం, వారు ఎదుర్కొన్న కష్టాలు, వాటిని ధైర్యంగా అధిగమించిన తీరు నేటి తరానికి ఆదర్శప్రాయమని గరిడేపల్లి గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ అన్నారు. మహాభారతంలో పాండవులు అనుసరించిన ధర్మమార్గం, న్యాయం పట్ల వారు చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.గరిడేపల్లి మండల కేంద్రంలో ముదిరాజుల కులదైవంగా భావించే పాండవుల ఆలయాన్ని శుక్రవారం సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యం, పట్టుదల, ధర్మబద్ధమైన ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. పాండవుల ఆదర్శాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని, సమాజంలో మంచి విలువలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపుర అంజన్ రెడ్డి, పైడిమర్రి రంగనాథ్, పెండెం శ్రీనివాస్ గౌడ్, బండ నర్సిరెడ్డి, కర్నే అరుణలక్ష్మీనారాయణ, ముదిరాజ్ సంఘం నాయకులు చామకూరి నాగేశ్వరరావు, చామకూరి దశరథ, ప్రధాని సైదులు, జిట్టబోయిన పకీరయ్య, మత్స్యకార్మిక సహకార సంఘం డైరెక్టర్లు, పలువురు ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

కీతవారిగూడెం అంగన్‌వాడీ కేంద్రం తలుపులు ధ్వంసం!

- **ఆకతాయిల దుశ్చర్యగా అనుమానం.. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై స్థానికుల ఆందోళన**

కీతవారిగూడెం, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–2 తలుపులు ధ్వంసమైన ఘటన వెలుగులోకి వచ్చింది. కొందరు ఆకతాయిలు తలుపులను కాలితో తన్ని విరగ్గొట్టినట్లు కేంద్రం నిర్వాహకురాలు యల్లావుల మల్లమ్మ వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా ఆందోళనకు కారణమైంది. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రాథమిక విద్యకు పునాది వేస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న కేంద్రాల ఆస్తులను ధ్వంసం చేయడం సరికాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఈ ఘటనకు బాధ్యులెవరో గుర్తించి, తగిన విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భీమదేవరపల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

- **ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర కీలకం: ఎమ్మార్పీఎస్ నాయకులు**

భీమదేవరపల్లి, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల):



ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజలకు--ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే పాత్రికేయ రంగం మరింత బలోపేతం కావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆకాంక్షించారు. భీమదేవరపల్లి మండల ప్రెస్ క్లబ్ (రిజి. నెం. 629/22) నూతన కార్యవర్గానికి శుక్రవారం ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన మాడుగుల రాజకుమార్, ప్రధాన కార్యదర్శి మాడుగుల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గౌడ చంద్రబాబులను నాయకులు శాలువాలతో సత్కరించారు. నూతన కార్యవర్గం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు.సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల బాధ్యత ఎంతో కీలకమని, ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ ప్రెస్ క్లబ్ ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి, మండల అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, దిలీప్, ప్రవీణ్, రమేష్, ప్రణయ్, మధుకర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలతో రైతులు అల్లాడుతున్నారు!

- **మోటార్లు కాలిపోతున్నాయి.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతున్నాయి**
- **రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి: ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

ఆసిఫాబాద్ (ప్రజానేస్తం జ్వాల):



రాష్ట్రంలో విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి విమర్శించారు. ఆసిఫాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు నష్టాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతున్న రైతులకు విద్యుత్ కోతలు మరింత భారంగా మారుతున్నాయని అన్నారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ సమస్యల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే సింగరేణి సంస్థ ప్రైవేటీకరణ ప్రతిపాదనలను విరమించుకోవాలని కోరారు. రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించి, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఏసీ 24°C పైన ఉంచితే విద్యుత్ ఆదా

- విద్యుత్ పొదుపుతో బిల్లులు తగ్గించుకోవచ్చు: ఎస్ఈ ఉత్తమ్ జాడే

ఆసిఫాబాద్ (ప్రజానేస్తం జ్వాల):



విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్ఈ ఉత్తమ్ జాడే సూచించారు. ఏసీ ఉష్ణోగ్రతను 24°C లేదా అంతకంటే ఎక్కువగా ఉంచాలని, ఏసీ ఫిల్టర్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని తెలిపారు. ఫ్రిజ్‌లు, గీజర్లను అవసరానికి తగ్గట్టు వాడాలని, అనవసర లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.

నూతన ఎస్సైని శాలువాతో సన్మానించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

భీమదేవరపల్లి, అక్టోబర్ 16 (ప్రజా నేస్తం జ్వాల:



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా ఎం. రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ, మండల అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కాదాసు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి దిలీప్, అధికార ప్రతినిధి మాడ్గుల ప్రణయ్, రాంనగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు కనకం రమేష్, హనుమకొండ జిల్లా సీనియర్ నాయకులు పార్నందుల సురేష్, బొల్లంపల్లి జోసఫ్, బుగ్గ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకొండలో కబడ్డీ పోటీలు -- విజేతలకు బహుమతుల ప్రదానం

భీమదేవరపల్లి ప్రజా నేస్తం జ్వాల అక్టోబర్ 16:



భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో నార్కోటిక్స్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల కార్యక్రమంలో డి.ఎస్.పి, సీఐ, ఎస్ఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి కొత్తకొండ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధమల్ల వెంకటేష్, ఊస కోయిల ప్రకాష్, పిడిశెట్టి కనకయ్య, మంగ రామచంద్రం, గోపగోని తిరుపతి, పూదరి రవీందర్, చింతరాజు, యాటపోలు శ్రీనివాస్, ఉపసర్పంచ్, ఫోరం అధ్యక్షులు తాళ్లపెల్లి అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి.. పనులు వేగవంతం చేయాలి

అసిఫాబాద్, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల):



జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను శాఖల మధ్య సమన్వయంతో వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్మాణాల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, విలేజ్ ఆర్గనైజేషన్ (Mz) భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, మరుగుదొడ్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి వాటి నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ భూములకు సంబంధించిన సమస్యల కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనుల విషయంలో ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించి పనులు ముందుకు సాగేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

- మహిళా సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడిన ఎస్పీ కె. నరసింహ
- సాంస్కృతిక వేడుకలతో సిబ్బందిలో ఆత్మీయత, ఐక్యత పెంపు

సూర్యాపేట, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల):



పూల పండుగ బతుకమ్మ వేడుకలతో సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం పండుగ శోభను సంతరించుకుంది. మహిళా పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, చిన్నారుల సందడితో పోలీస్ కార్యాలయ ప్రాంగణం కళకళలాడింది. జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ ఉత్సవాలను ప్రారంభించి, మహిళా పోలీసు సిబ్బందితో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బతుకమ్మ, విజయదశమి పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు పోలీసు సిబ్బంది మధ్య స్నేహభావాన్ని, ఆత్మీయతను, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు సిబ్బందికి సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. పోలీసు సిబ్బంది ఒక కుటుంబంలా కలిసిమెలిసి ఉంటూ, పరస్పర సహకారంతో విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.

ఆటపాటలతో మహిళా సిబ్బంది సందడి

మహిళా పోలీసు సిబ్బంది వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. చిన్నారులు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకలు మరింత సందడిగా సాగాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు, జిల్లా ప్రజలకు బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, డీఎస్పీ నరసింహచారి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, మహిళా సూపరింటెండెంట్లు సబితా రాణి, శ్రీదేవి, మహిళా ఎస్ఐలు ఝాన్సీ రాణి, తేజస్విని, మహిళా సిబ్బంది అరుణ, కవిత, జ్యోతి, పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్, సంఘం సభ్యులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయ పాలకమండలిలో గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోత్కూరి రాము మయూరికి మరోసారి అవకాశం!

- ఆలయ అభివృద్ధిలో కీలక పాత్రకు గుర్తింపు
- రెండోసారి ధర్మకర్తలుగా నియామకం.. పలువురు ప్రముఖుల అభినందనలు

హనుమకొండ, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి మారెల్లి కిరణ్):



చారిత్రక వరంగల్ శ్రీ భద్రకాళి దేవాలయ ధర్మకర్తలుగా పనిచేసిన గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోత్కూరి రాము మయూరి దంపతులకు నూతన పాలకమండలిలో మరోసారి అవకాశం లభించింది. గత పాలకవర్గంలో ఆలయ అభివృద్ధికి వారు అందించిన సేవలను గుర్తించి ప్రభుత్వం రెండోసారి అవకాశం కల్పించింది. దీంతో అమ్మవారి సేవలో మరోసారి భాగస్వాములు కానుండటంపై వారి అభిమానులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధిలో విశేష కృషి

గత పాలకమండలిలో ఉన్న సమయంలో ఆలయానికి నూతన రంగులు వేయించడం, భారీ ధ్వజస్తంభం ఏర్పాటు, భక్తుల సౌకర్యార్థం రోజుకు మూడు ట్రిప్పుల ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం, భారీ రథం ఏర్పాటు వంటి కార్యక్రమాల్లో గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోత్కూరి రాము మయూరి దంపతులు కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు.వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల సహకారంతో పాలకమండలిలో సమన్వయం సాధిస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలోనూ వారు చొరవ చూపారని పేర్కొన్నారు.

అమ్మవారి సేవకు మరోసారి అవకాశం

భద్రకాళి అమ్మవారి సేవలో మరోసారి భాగస్వాములు కావడం పట్ల గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోత్కూరి రాము మయూరి దంపతులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. నూతన పాలకమండలిలో వారికి మరోసారి అవకాశం లభించడంపై పలువురు ప్రముఖులు, అభిమానులు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు వారు కృషి చేయాలని ఆకాంక్షించారు.

గ్రామాలకు కొత్త వెలుగులు.. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ!

- భీమదేవరపల్లి మండలంలో విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ.27 లక్షలు
- 25 ప్రాంతాల్లో దీపాలు.. బస్టాండ్లు, కాలనీలు, కూడళ్లకు ప్రాధాన్యం

భీమదేవరపల్లి (ప్రజానేస్తం జ్వాల):




మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో భీమదేవరపల్లి మండలంలోని గ్రామాలు, తండాలు, కాలనీల్లో విద్యుత్ దీపాల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. రాత్రివేళల్లో చీకట్లను తొలగించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో వివిధ ప్రాంతాల్లో దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ.27 లక్షలు కేటాయించినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, బస్టాండ్లు, ఆటో స్టాండ్లు, అంబేద్కర్ సర్కిళ్లు, ఆలయాల పరిసరాలు, గ్రామ పంచాయతీ భవనాల వద్ద దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యుత్ దీపాల ఏర్పాటు పూర్తయితే రాత్రివేళల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తగ్గడంతో పాటు ప్రధాన కూడళ్లు, కాలనీల్లో వెలుతురు అందుబాటులోకి రానుంది. అయితే, పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

కీతవారిగూడెంలో ఘనంగా శ్రీ కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు

- నూతన దేవాలయంలో తొలిసారిగా సామూహిక కుంకుమార్చన.. బ్రహ్మశ్రీ రాయప్రోలు శ్రీరామయ్య శర్మ మంత్రోచ్చారణల మధ్య పూజలు
- మహిళా భక్తులు, గ్రామ ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ ఆహ్వానం

కీతవారిగూడెం (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలోని శ్రీ మారెమ్మ, అంకమ్మ, మద్దిరావమ్మ, శ్రీ కనకదుర్గమ్మ దేవతల ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో తొలిసారిగా నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం సుప్రభాత సేవతో పాటు ఆరు గంటలకు అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్నారు. జగన్మాతను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తుండటంతో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.

రేపు మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు.. సామూహిక కుంకుమార్చన

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రేపు అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని నూతన దేవాలయంలో తొలిసారిగా సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ రాయప్రోలు శ్రీరామయ్య శర్మ గారి మంత్రోచ్చారణల మధ్య ఈ పవిత్ర కుంకుమార్చన కార్యక్రమం జరగనుంది. వేదమంత్రాల నడుమ నిర్వహించే ఈ పూజా కార్యక్రమంలో మహిళా భక్తులు, గ్రామ ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరారు.

మహిళా భక్తులకు ఆలయ కమిటీ ఆహ్వానం

నూతన దేవాలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా తొలిసారిగా నిర్వహిస్తున్న సామూహిక కుంకుమార్చనను విజయవంతం చేసేందుకు గ్రామంలోని మహిళలందరూ తమ వంతు సహకారం అందించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మూలా నక్షత్రం వేళ.. సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారి దర్శనం

కొత్తకొండ, భీమదేవరపల్లి మండలం, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారిని సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చేలా అలంకరించారు. మూలా నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ఈ పుణ్యక్షేత్రంలో భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆరో రోజు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. విద్య, జ్ఞానం, వివేకానికి ప్రతీకగా కొలిచే సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు భక్తిపారవశ్యంతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో శైవశుద్ధి, పుణ్యాహవాచనం, సర్వతోభద్ర మండల ఆవాహన తదితర క్రతువులను నిర్వహించారు. అనంతరం చతుఃషష్టి ఉపచార పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా చేపట్టారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యా లు, సకల శుభాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణను దేవస్థాన కార్యనిర్వహణ అధికారి పి. కిషన్‌రావు పర్యవేక్షించారు.

పోలీస్ ఫ్లాగ్ డే పోటీల్లో యువత ప్రతిభ చాటాలి

వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీలో రాష్ట్రస్థాయి పోటీలు: వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పిలుపు

హనుమకొండ, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల):

పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు, యువత, పౌరులు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పిలుపునిచ్చారు. సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నివారణ, సమాజంలో పోలీసుల సేవలు వంటి కీలక అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు. సామాజిక సమస్యలపై సృజనాత్మకంగా స్పందిస్తూ, ప్రజలకు ఉపయోగపడే సందేశాలను తమ రచనలు, చిత్రాల ద్వారా అందించాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ మోసాల పట్ల అప్రమత్తత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, ప్రజల భద్రతలో పోలీసుల పాత్ర వంటి అంశాలను ప్రతిబింబించేలా ఎంట్రీలు రూపొందించాలని తెలిపారు.పోటీలకు ముఖ్యమైన తేదీలు: (వ్యాసరచన పోటీలు: అక్టోబర్ 27, 28, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ: అక్టోబర్ 30). కావున ఆసక్తి గల అభ్యర్థులు తమ ఎంట్రీలను అధికారిక పోలీస్ ఫ్లాగ్ డే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సీపీ సూచించారు. నిర్ణీత గడువులోగా ఎంట్రీలను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీస్ శాఖ నిర్వహిస్తున్న ఈ పోటీల ద్వారా యువతలో సామాజిక బాధ్యత, సృజనాత్మకత పెంపొందడంతో పాటు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

టీజీఎస్ఆర్టీసీలో డబుల్ డ్యూటీపై కీలక ఆదేశాలు!

హనుమకొండ, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి మారెల్లి కిరణ్):

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో ఉద్యోగుల డబుల్ డ్యూటీలు, అదనపు పనివేళలకు సంబంధించిన చెల్లింపులపై యాజమాన్యం కీలక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అదనపు విధులు నిర్వహించే డ్రైవర్లు, కండక్టర్లకు నగదు రూపంలో చెల్లింపులు చేయాలని, వాటికి బదులుగా ప్రత్యామ్నాయ సెలవులు మంజూరు చేయరాదని డిపో మేనేజర్లకు స్పష్టం చేసినట్లు తెలిసింది. డబుల్ డ్యూటీలకు బదులుగా ప్రత్యామ్నాయ సెలవులు ఇవ్వడం వల్ల సిబ్బంది అందుబాటులో లేక బస్సు సర్వీసుల నిర్వహణపై ప్రభావం పడుతోందని యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. ప్రయాణికులకు రవాణా సేవల్లో అంతరాయాలు కలగకుండా సిబ్బంది నిర్వహణను సమర్థవంతంగా చేపట్టే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఓవర్‌టైమ్ (ఓటీ) విధులు నిర్వహించే ఉద్యోగులకు నిబంధనల ప్రకారం తగిన అదనపు వేతనం చెల్లించడంతో పాటు, వారి విశ్రాంతికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కార్మిక సంఘం ఎస్‌డబ్ల్యూఎఫ్ (ఫ్రౌఖీ) యాజమాన్యాన్ని కోరుతున్నట్లు పేర్కొంది. ఉద్యోగులపై అదనపు పనిభారం పడకుండా, వారి హక్కులు, ఆరోగ్యం, విశ్రాంతికి ప్రాధాన్యం ఇవ్వాలని కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది. యాజమాన్యం ఆదేశాలు అమలులోకి వస్తే డబుల్ డ్యూటీలు నిర్వహించే డ్రైవర్లు, కండక్టర్ల పని విధానాలు, చెల్లింపులపై ప్రభావం ఉండే అవకాశం



ఉంది. ఈ నేపథ్యంలో అదనపు విధులకు సంబంధించిన చెల్లింపులు, విశ్రాంతి, సెలవులపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని ఉద్యోగులు ఆశిస్తున్నారు.


నవోదయ ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

హనుమకొండ, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి మారెల్లి కిరణ్):

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027--28 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు అధికారులు మరో అవకాశం కల్పించారు. లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ (ఞజూూ) దరఖాస్తు గడువును అక్టోబర్ 22 వరకు పొడిగించారు. ప్రస్తుతం 8, 10వ తరగతులు చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తుల సవరణకు ప్రత్యేక అవకాశం ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించిన విద్యార్థులు తమ వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సరిచేసుకునేందుకు అక్టోబర్ 23 నుంచి 25వ తేదీ వరకు కరెక్షన్ విండో అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. దరఖాస్తు చేసే ముందు విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలు, విద్యా సంబంధిత సమాచారాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు.

వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ప్రవేశ పరీక్ష

నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంపిక పరీక్షను 2027 ఏప్రిల్ 10న నిర్వహించనున్నట్లు సమాచారం. అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పరీక్షకు అవసరమైన సన్నద్ధతను ఇప్పటి నుంచే



ప్రారంభించాలని సూచించారు. నవోదయ విద్యాలయాల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారిక వెబ్‌సైట్ https://navodaya.gov.in/ ను సందర్శించి అర్హతలు, దరఖాస్తు విధానం, పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించాలని అధికారులు సూచించారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

హనుమకొండ, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి మారెల్లి కిరణ్):

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా నగరంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టి, శుక్రవారం సాయంత్రంలోగా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ వెంకన్న అధికారులను ఆదేశించారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. పండుగ ఏర్పాట్లను సమీక్షించేందుకు కమిషనర్ నగరంలోని హసన్‌పర్తి, భీమారం, వడ్డేపల్లి, పద్మాక్షి గుండం, రంగలీల మైదానం తదితర ప్రధాన ప్రాంతాల్లో స్వయంగా పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, వీధి దీపాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి ఉత్సవ ప్రాంగణాలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. బతుకమ్మ, దసరా వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు హాజరయ్యే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణ, పరిశుభ్రత, తగిన వెలుతురు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ ఆదేశించారు. ముఖ్యంగా చెరువులు, గుండాల వద్ద ప్రజల భద్రతకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్సవ ప్రాంగణాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతర పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, ప్రజలకు అవసరమైన



సదుపాయాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి పండుగ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు పండుగలను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకునేలా నగరంలో అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

జంగుబాయి ఆలయానికి శాశ్వత రహదారి నిర్మించాలి!

ఆసిఫాబాద్, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి మాడావి మనోహర్):

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కోట పారాందోలి మహారాజ్‌గూడలోని రైథడ్ జంగుబాయి దేవస్థానానికి వెళ్లే రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని భక్తులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గిరిజన భక్తులకు ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ పుణ్యక్షేత్రానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఏటా భక్తులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుష్యమాసం సందర్భంగా తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు జంగుబాయి దేవస్థానాన్ని దర్శించుకుంటారు. ఈ సమయంలో రహదారి సౌకర్యం సక్రమంగా లేకపోవడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చే కుటుంబాలు ప్రయాణంలో అవస్థలు పడుతున్నాయని భక్తులు పేర్కొంటున్నారు. ప్రతి సంవత్సరం పుష్యమాసానికి ముందు రహదారిపై మట్టి పనులు, తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నప్పటికీ అవి కొంతకాలానికే దెబ్బతింటున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఏటా అదే సమస్య పునరావృతమవుతోందని, తాత్కాలిక పనులకే పరిమితం కాకుండా శాశ్వత రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చే జంగుబాయి దేవస్థానానికి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రహదారి పరిస్థితిని పరిశీలించాలని, అవసరమైన సర్వే నిర్వహించి నిర్మాణానికి తగిన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నాయకులు మాడావి భరత్ భూషణ్ మాట్లాడుతూ, జంగుబాయి దేవస్థానానికి వచ్చే భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రహదారి సమస్యను ప్రాధాన్యంగా పరిగణించాలని కోరారు. తాత్కాలిక మరమ్మతులకు బదులుగా శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మిర్చి అదనపు తూకం సొమ్ము రైతులకే దక్కాలి!

ఎనుమాముల, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి: మారెల్లి కిరణ్):



ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి బస్తాల్లో 49 కిలోలకు మించి వచ్చే అదనపు తూకానికి సంబంధించిన ఆదాయాన్ని మార్కెట్ కమిటీ ఖాతాలో జమ చేసి, ఆ నిధులను రైతుల సంక్షేమానికే వినియోగించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్ రావు డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేలా తూకాల విధానంలో పారదర్శకత పాటించాలని, అదనంగా వచ్చే ఆదాయం అన్నదాతల ప్రయోజనాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ప్రతినిధి బృందం ఎనుమాముల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రియాంకతో పాటు సంబంధిత ఉన్నతాధికారులను కలిసి సవివరమైన వినతిపత్రాన్ని అందజేసింది. మిర్చి విక్రయాల సమయంలో తూకాలకు సంబంధించిన లెక్కలు పారదర్శకంగా ఉండాలని, రైతులకు నష్టం కలగకుండా మార్కెట్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌లో మిర్చి బస్తాల తూకం 49 కిలోలు దాటినప్పుడు వచ్చే అదనపు మొత్తానికి సంబంధించిన ఆదాయం ఎక్కడికి వెళ్తోంది, దానిని ఎలా వినియోగిస్తున్నారు అనే అంశాలపై స్పష్టత ఉండాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఆ ఆదాయాన్ని మార్కెట్ కమిటీ ఖాతాకు జమ చేసి, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాల కోసం వినియోగించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్లలో రైతుల ప్రయోజనాలే ప్రధానంగా ఉండాలని, రైతులు పండించిన పంటను విక్రయించే ప్రతి దశలో పారదర్శకమైన విధానాలు అమలు కావాలని మోర్తాల చందర్ రావు పేర్కొన్నారు. అదనపు తూకానికి సంబంధించిన ఆదాయంపై అధికారులు స్పష్టమైన నిర్ణయం తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు, ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

హనుమకొండ ఆయుష్ శాఖలో ఉద్యోగాల భర్తీ.. 28వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం!

హనుమకొండ, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి మారెల్లి కిరణ్):

హనుమకొండ జిల్లాలోని ఆయుష్ శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాతీయ ఆయుష్ మిషన్ కింద 8 ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎస్. మహేంద్రకుమార్ తెలిపారు. వైద్య, ఆరోగ్య రంగాల్లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ఈ నియామకాలు అవకాశంగా నిలవనున్నాయి. ఈ నియామకాల్లో మెడికల్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, సైకోసోషల్ కౌన్సిలర్, యోగా ప్రొఫెషనల్, మల్టీపర్పస్ వర్కర్ తదితర పోస్టులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆయా పోస్టులకు నిర్దేశించిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ తేదీలు: అక్టోబర్ 22 నుంచి 28 వరకు అభ్యర్థులు తమ దరఖాస్తులను ఐడీఓసీ (IDOC) కార్యాలయంలో నేరుగా సమర్పించాల్సి ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తులు స్వీకరిస్తారా లేదా అనే విషయంపై అధికారిక ప్రకటనను పరిశీలించాలని సూచించారు. పోస్టుల వారీగా విద్యార్హతలు, వయోపరిమితి, జీతభత్యాలు, ఎంపిక విధానం, అవసరమైన ధ్రువపత్రాలు తదితర పూర్తి వివరాలను హనుమకొండ జిల్లా అధికారిక వెబ్‌సైట్ hanumakonda.telangana.gov.in లో పరిశీలించాలని జిల్లా నోడల్ అధికారి తెలిపారు. ఉద్యోగాలకు అర్హత కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్‌లోని నిబంధనలను పూర్తిగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు.

పేకాట స్థావరంపై పోలీసుల పంజా.. ఆరుగురు పట్టివేత, నగదు--వాహనాలు స్వాధీనం!

హనుమకొండ, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి మారెల్లి కిరణ్):



హనుమకొండ నగరంలోని కాకతీయ కాలనీలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. పక్కా సమాచారంతో చేపట్టిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కాకతీయ కాలనీలో రహస్యంగా పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేపట్టింది. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని వారి వద్ద ఉన్న రూ.37,690 నగదును స్వాధీనం చేసుకుంది. అదేవిధంగా ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన వ్యక్తులతో పాటు స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు. జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. సరదా, విలాసాల పేరుతో జూదానికి అలవాటుపడి ఆర్థికంగా నష్టపోవడంతో పాటు కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టవద్దని సూచించారు. నగరంలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

హనుమకొండలో క్రీడా సంబరం.. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు!

హనుమకొండ, అక్టోబర్ 16 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి మారెల్లి కిరణ్):

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. హనుమకొండలోని చారిత్రక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన 70వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పాఠశాల స్థాయి అండర్-17, అండర్-19 క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. వివిధ క్రీడాంశాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల ముగింపు సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కలిసి ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమలోని క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలకు కూడా తగిన ప్రాధాన్యం ఇస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా, క్రీడా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

